సాక్షి మహబూబ్‌నగర్


బుధవారం : 24 : జనవరి : 2024



మార్కెట్ కమిటీలపై గురి

మార్కెట్ కమిటీలను రద్దు చేయడంతో ఆశావహుల్లో సందడి నెలకొంది.

వివరాలు 10లో ►



వచ్చేనెలలో ఉత్సవాలు

మన్యంకొండ వెంకన్నస్వామి ఉత్సవాలు ఫిబ్రవరి 19న ప్రారంభం కానున్నాయి.

వివరాలు 10లో ►

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 34.2 /16.5

ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. తేమ ఎక్కువగా ఉంటుంది. ఉదయం చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కందులకు రికార్డు ధర

- బాదేపల్లి మార్కెట్‌లో క్వింటాల్ రూ.9,719



జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం కందులకు రికార్డు ధర లభించింది. ఇప్పటివరకు యార్డు చరిత్రలో ఇంత ధర దక్కడం ఇదే ప్రథమంగా వ్యాపారవర్గాలు తెలిపాయి. కందులకు అత్యధికంగా క్వింటాల్ గరిష్ఠంగా రూ.9,719 ధర దక్కింది. కనిష్ఠంగా రూ.8,459 ధర కేటాయించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7 వేలు ఉండగా అంతకు మించి ధరలు లభిస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో సైతం ఇదే ధర గరిష్ఠంగా దక్కిందని మార్కెట్ యార్డు అధికారులు తెలిపారు. అదేవిధంగా వేరుశనగ క్వింటాల్ గరిష్ఠంగా రూ.7,189, కనిష్ఠంగా రూ.3,302, ఆర్‌ఎన్ఆర్ రకం ధాన్యానికి క్వింటాల్ గరిష్ఠంగా రూ.3,065, కనిష్ఠంగా రూ.3,031, పెబ్బర్లు రూ.7,150 మినుములు రూ.6,480 ధరలు లభించాయి.

విద్యుత్ సమస్యలపై కాల్ సెంటర్ ఏర్పాటు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాలో విద్యుత్ సమస్యలపై వినియోగదారుల ఫిర్యాదులు చేసేందుకు కాల్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ మహబూబ్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ వెంకటశిరామ్, జడ్చర్ల డివిజన్ ఇంజినీర్ కృష్ణమూర్తి మంగళవారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ డివిజనల్ పరిధిలోని మహబూబ్‌నగర్ పట్టణం, రూరల్ మండలం, హన్వాడ, కోయిల్‌కొండ, గండేడ్, మహమ్మదాబాద్, దేవరకద్ర, చిన్నచింతకుంట, కౌకుంట్ల మండలాల పరిధిలో గల విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను 08542-293096, 293025 నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయవచ్చని తెలిపారు. జడ్చర్ల డివిజన్ పరిధిలోని జడ్చర్ల పట్టణం, రూరల్ మండలం, భూత్పూర్, మూసాపేట, అడ్డాకుల, బాలానగర్, రాజాపూర్, నవాబ్‌పేట మండలాల పరిధిలోని వినియోగదారులు 94404 92951, 95508 85156 నంబర్లకు తెలియజేయాలని సూచించారు. ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్న ఫోన్ చేసి తెలియజేయవచ్చని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సిలబస్‌పై అవగాహన పెంచుకోవాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో బీఈడీ కళాశాల అధ్యాపకులు మరియు ప్రిన్సిపాళ్లకు నూతనంగా మారిన సిలబస్‌పై ఓరింటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ మాట్లాడుతూ అధ్యాపకులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సిలబస్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం పలువురు అధ్యాపకులు సిలబస్ మార్పులకు సంబంధించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఓయూ అధ్యాకులు రామకృష్ణ, మృణాళిని, ప్రిన్సిపాల్ బషీర్‌అహ్మద్, హెచ్‌ఓడీ విశ్వనాథ్, శంకర్, సునీత, లలిత, సరస్వతి పాల్గొన్నారు.


టెన్త్‌లో మంచి గ్రేడ్ సాధించాలి: డీఈఓ



దేవరకద్ర రూరల్/చిన్నచింతకుంట: కౌకుంట్ల, పేరూర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు జిల్లా స్థాయిలో మంచి గుర్తింపు ఉందని, దాన్ని కాపాడాల్సిన బాధ్యత పదో తరగతి చదువుతున్న విద్యార్థులపై ఉందని డీఈఓ రవీందర్ తెలిపారు. మంగళవారం పేరూర్, కౌకుంట్లతో పాటు చిన్నచింతకుంట మండలం అప్పంపల్లిలోని ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రణాళికబద్ధంగా చదివి పరీక్షల్లో మంచి గ్రేడ్‌ను సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమీక్ష ఏర్పాటు చేశారు. పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెరిగేలా సమష్టిగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వం పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తుందన్నారు. అందుకు విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో సీఎంఓ బాలు యాదవ్, హెచ్‌ఎం సుమన్ మహారాజ్, పద్మ పాల్గొన్నారు.

ఫీజుల మోత

పాలమూరు యూనివర్సిటీలో అధికారుల వింత ధోరణి



పీయూ పీజీ కళాశాల భవనం

- ఒక్కో కోర్సుకు రూ.20-30 వేల వరకు డిమాండ్
- హాస్టల్‌లో చేరాలంటే రూ.10 వేలు ముందుగానే చెల్లింపు
- స్పెషల్ ఫీజు పేరిట రూ.1,800.. స్పష్టత ఇవ్వని వైనం
- మధ్యలోనే వెనుదిరుగుతున్న పలువురు విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: యూనివర్సిటీలో చేరాలని నెలల తరబడి కష్టపడి పీజీ సీటు సాధిస్తే.. అడ్మిషన్లు తీసుకున్నాక ఫీజులు చూసి విద్యార్థుల తల్లిదండ్రులు షాక్ అవుతున్నారు. చాలామంది పేద విద్యార్థులు ప్రభుత్వ యూనివర్సిటీలో సీటు సాధిస్తే ఉచితంగా పీజీ చదువుకోవచ్చని భావిస్తారు. కానీ, పాలమూరు యూనివర్సిటీలో మాత్రం అడ్మిషన్, హాస్టల్ తదితర వాటికి రూ.వేలల్లో ఫీజులు చెల్లించాల్సి వస్తోంది. అలా చెల్లించలేని కొంత మంది అడ్మిషన్‌ను రద్దు చేసుకునే పరిస్థితి నెలకొంది. దీంతో యూనివర్సిటీలోని కొన్ని కోర్సుల్లో పూర్తిస్థాయిలో అడ్మిషన్లు జరగడం లేదు. అంతే కాకుండా కళాశాల, హాస్టల్ ఫీజులు చెల్లించలేని చాలామంది విద్యార్థులు మధ్యలోనే వెనుదిరుగుతున్నారని విద్యార్థి సంఘాలు పేర్కొంటున్నాయి. యూనివర్సిటీని నడపడానికి అధికారులు ప్రైవేటు కళాశాలల మాదిరిగా ఫీజులు వసూలు చేస్తున్నారని విద్యార్థి సంఘాల ఆరోపిస్తున్నాయి.

సమాధానం కరువు..

పీయూ అధికారులు ఎక్కడా లేని విధంగా విద్యార్థుల నుంచి స్పెషల్ ఫీజు పేరిట రూ.1,800 వసూలు చేస్తున్నారు. ఈ మొత్తం ఎందుకు తీసుకుంటున్నారు అనే ప్రశ్నకు అధికారుల స్పష్టమైన సమాధానం రావడం లేదు. కేవలం ఐడీ కార్డులు ఇవ్వాలని, వైఫై సదుపాయం, లైబ్రరీ వినియోగం, ఇండోర్ గేమ్స్ వినియోగం వంటి వాటి ఖర్చుల కోసం వసూలు చేస్తున్నట్లు తెలుస్తుంది. పీయూలో ఉన్న వసతుల వినియోగం కోసం కూడా అధికారులు ఫీజులు వసూలు చేయడం విమర్శలకు తావిస్తుంది. అధికారులు మాత్రం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో అనుమతి అనంతరం ఫీజులు వసూలు చేస్తున్నట్లు పేర్కొంటున్నారు. వీటన్నింటితోపాటు ప్రతి సంవత్సరం సెమిస్టర్, సప్లిమెంటరీలకు ఫీజులు ప్రత్యేకంగా చెల్లించాల్సి వస్తుంది.

స్కాలర్‌షిప్ రాకపోతే..

యూనివర్సిటీలో ఓసీ, ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు, డబుల్ పీజీ చేసిన వారు, స్కాలర్‌షిప్ రానివారు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇక ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు అయితే ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. కానీ, కోర్సు పూర్తయ్యి.. సర్టిఫికెట్ పొందే నాటికి ప్రభుత్వం స్కాలర్‌షిప్ మంజూరు చేయకపోతే వాటికి ఉన్న నిర్ణీత ఫీజులను చెల్లిస్తేనే అధికారులు సర్టిఫికెట్లు ఇస్తున్నారు. గతంలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులకు మాత్రమే ఫీజులు చెల్లించి, రెగ్యులర్ అధ్యాపకులు ఉన్న కోర్సులకు నామమాత్రపు ఫీజులు వసూలు చేసేవారు. కానీ, ఇప్పుడు అన్ని గ్రూప్‌లకు ఫీజులు వసూలు చేస్తున్నారు. సైన్స్ గ్రూప్‌లకు రూ.30 వేలు, ఆర్ట్స్ గ్రూప్‌లకు రూ.20 వేలు, హాస్టల్‌లో సీటు కావాలంటే ఓసీలు రూ.10 వేలు, బీసీలు రూ.8 వేలు, ఎస్సీ, ఎస్టీలు రూ.6 వేలు చెల్లించాల్సిందే. అడ్వాన్స్ చెల్లించాక కూడా మొత్తంగా ప్రతి సంవత్సరం ఒక్కో విద్యార్థి రూ.20- 23 వేల వరకు మెస్ బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో 50 శాతం ప్రభుత్వం నుంచి రాగా.. మిగతా మొత్తాన్ని విద్యార్థి భరించాలి. రెండు సంవత్సరాలకు కలిసి రూ.40 వేల వరకు ఒక్కో విద్యార్థికి బిల్లు వచ్చే అవకాశం ఉంది. ఈ క్రమంలో కళాశాల, హాస్టల్ ఫీజులు చెల్లించలేని నిరుపేద విద్యార్థులు సర్టిఫికెట్లు తీసుకోకుండానే వదిలేస్తున్నారు.

ఆదాయం కోసమే..



పీయూలో ప్రైవేటు కళాశాలల మాదిరిగానే ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రస్తుత వీసీ వచ్చాక మరింత పెంచారు. ఓయూ పీజీ సెట్ అలాట్‌మెంట్ కార్డులో స్పెషల్ ఫీజు వసూలు ప్రస్తావనే లేదు. కానీ, ఏ కళాశాలలో లేని విధంగా ఇక్కడ వసూలు చేయడం పేద విద్యార్థులకు షరాఘాతంగా మారింది. రూ.30 ఐడీ కార్డు, స్పోర్ట్స్ కోసం వసూలు చేస్తున్నామని చెబుతున్నారు. కానీ, వాటికి కూడా స్పష్టత ఇవ్వడం లేదు.

– రాము, పీయూ జేఏసీ చైర్మన్

భారం తగ్గించాలి..



ప్రభుత్వ యూనివర్సిటీలో ప్రైవేట్ కళాశాలల మాదిరిగా ఫీజులు వసూలు చేయడం పేద విద్యార్థులను విద్యను దూరం చేయడమే. గతంలో లేని విధంగా స్పెషల్ ఫీజు, కోర్సు ఫీజులను ఈ సంవత్సరమే పెంచారు. వెంటనే వాటిని తగ్గించి విద్యార్థులపై భారం తగ్గించాలి. ఫీజులు కట్టలేని కొందరు మధ్యలోనే వెళ్లిపోతున్నారు.

– అర్జున్, ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు

ఫీజులు తగ్గించాలి..



యూనివర్సిటీలో ప్రైవేటు కళాశాలల మాదిరిగా ఫీజులు పెంచవద్దు. ఈ సంవత్సరం కోర్సు ఫీజులు, స్పెషల్ ఫీజులు ఇలా అన్నీ పెంచారు. దీంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను కూడా విడుదల చేయాలి. విద్యార్థులకు స్కాలర్‌షిప్ రాకపోతే సర్టిఫికెట్లు ఇచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలి.

– పవన్‌రెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ పీయూ అధ్యక్షుడు

ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే..



ప్రభుత్వం ఆదేశాలు, ఈసీ నిర్ణయాల ప్రకారమే విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నాం. అయితే హాస్టల్, కళాశాల, స్పెషల్, ఫీజులు కట్టాల్సిన అవసరం లేదు. ఓసీలు, డబుల్ పీజీ చేసేవారు మాత్రమే వాటిని చెల్లించాలని చెబుతున్నాం. సర్టిఫికెట్లు స్కాలర్‌షిప్ మంజూరు అయిన వారికి ఇస్తున్నాం.

– చంద్రకిరణ్, ప్రిన్సిపాల్, పాలమూరు యూనివర్సిటీ

పీయూలో 15 కోర్సులు కలిపి 1,400 మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. అంటే వీరి నుంచి ప్రతి సంవత్సరం కేవలం స్పెషల్ ఫీజు పేరిట రూ.25 లక్షల వరకు వసూలు చేస్తున్నారు.

గణతంత్ర దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవినాయక్, ఇతర అధికారులు

పాలమూరు/మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలోని పోలీస్‌పరేడ్ గ్రౌండ్స్‌లో గణతంత్ర దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జి.రవినాయక్ ఆదేశించారు. మంగళవారం కొత్త కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 26వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు పరేడ్ మైదానంలో జాతీయ జెండా ఆవిష్కరణ ఉంటుందన్నారు. అంత వరకే అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలలో జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని సూచించారు. అన్ని గ్రామాలు, పట్టణాలు, మండల కేంద్రాల్లో జాతీయ పతాకం ఎగురవేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటిలాగే ఈసారి కూడా ముఖ్య అతిథి సందేశం, విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేస్తామన్నారు. అలాగే ఆయా శాఖల ద్వారా అభివృద్ధిని తెలిపేలా స్టాళ్లు ఏర్పాటుచేయాలన్నారు. అనంతరం 'ప్రజావాణి' పిటిషన్లు, సీఎం ప్రజావాణి ఫిర్యాదులు, బయోమెట్రిక్, ఈ-ఆఫీసు ఫైళ్ల నిర్వహణ తదితర అంశాలపై క్షుణ్ణంగా సమీక్షించారు.

రోడ్డు ప్రమాదాల కట్టడికి చర్యలు తీసుకోవాలి

రోడ్డు ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ రవినాయక్ అన్నారు. ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు నెల రోజులపాటు నిర్వహించనున్న జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా మంగళవారం ఐడీఓసీలో ఆయన వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రోడ్డు భద్రత అనేది అత్యంత ప్రాధాన్యమైనదని, ముఖ్యంగా రాష్ట్రంలో రహదారి సౌకర్యాలు బాగుండడం, మానవ తప్పిదాల వల్ల అనేక రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని, మానవ తప్పిదాల వల్లనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా యుక్త వయసులో ఉన్న పిల్లలపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని, ఆటోలు, ట్రాలీలు, టాక్సీలు, ప్రైవేట్ వాహనాలలో ప్రజలు ప్రయాణించకుండా ఎక్కువ మందిని తీసుకెళ్లకుండా గట్టి నిఘా ఉంచాలన్నారు. అలాగే రోడ్డు నియమాలను పాటిస్తూ వాహనాలు నడపడం వల్ల సురక్షితంగా ఉంటుందని అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, గట్టి నిఘావల్లనే వాహనాలు నడిపే వారిలో భయం వస్తుందని తెలిపారు. అదే విధంగా జాతీయ రహదారిపై దాబాల్లో అక్రమ మద్యం వంటి వాటిని అరకటంపై ఎక్సైజ్ శాఖ దృష్టి సారించాలని తెలిపారు. ఆయా సమావేశాల్లో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, ఎస్.మోహన్ రావు, డీఆర్‌ఓ రవికుమార్, డీటీఓ దుర్గా ప్రమీల, ఎంవీఐలు నరేష్ పాల్గొన్నారు.

పకడ్బందీగా ఈఎస్‌ఎంఎస్ నిర్వహణ

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న సమయంలో పట్టుకున్న నగదు, మద్యం వివరాల నిర్వహణకు ఎన్నికల సీజర్ మానిటరింగ్ సిస్టం(ఈఎస్‌ఎంఎస్)ను పకడ్బందీగా నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు పంకజ్, సంతోష్‌లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా సీజ్ చేసే మద్యం, నగదు వివరాలను ఈఎస్‌ఎంఎస్ పోర్టల్‌లో మొబైల్ యాప్ ద్వారా నమోదు చేయవచ్చని, డేటా నిర్వహణ, జిల్లా ఎన్నికల అధికారులు, రాష్ట్ర సీఈఓలు, జిల్లా, రాష్ట్ర స్థాయి నోడల్ అధికారుల పాత్రలపై పలు రాష్ట్రాల సీఈఓలు, జిల్లా ఎన్నికల అధికారులతో మంగళవారం న్యూఢిల్లీ నుంచి వీసీ ద్వారా సమీక్షించారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్న సమయంలో పట్టుకున్న నగదు, మద్యం వివరాల నిర్వహణకు రాష్ట్ర, జిల్లాస్థాయిల్లో 25 ఏజెన్సీలను గుర్తించడం జరిగిందని పేర్కొన్నారు. ఎఫ్‌ఎస్‌టీ బృందాలు, వ్యయ నిర్వహణ కమిటీలు యాప్ ద్వారా డేటాను నమోదు చేయడం, జిల్లా అధికారుల బాధ్యతలు, రాష్ట్ర ఎన్నికల అధికారుల బాధ్యతలు తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా గత ఎన్నికల్లో రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను 1.38లక్షల మంది వినియోగించారని, పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ విడుదలైన అనంతరం ఈ యాప్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. వీసీలో కలెక్టర్ జి.రవినాయక్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీసీఓ సుధాకర్, జిల్లా ఆడిట్ అధికారి శ్యాంసుందర్, ఎస్‌బీసీ డీజీఓ సత్యనారాయణమూర్తి, ఎఫ్‌ఎస్‌టీ బృందాల లీడర్లు పాల్గొన్నారు.

అభ్యంతరాలను జాప్యం లేకుండా పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాన్నింటినీ జాప్యం లేకుండా పరిష్కరించాలని కలెక్టర్ జి.రవినాయక్ సూచించారు. మంగళవారం ఓటరు జాబితా సవరణలో భాగంగా వచ్చిన అభ్యంతరాలు, కొత్త ఓటరు నమోదు, తదితర అంశాలపై ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో టెలీ కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈనెల 22న ఒక్కరోజే జిల్లాలోని 3 నియోజకవర్గాలలో సుమారు 7,892 అభ్యంతరాలను పరిష్కరించడంపై ఆయన అభినందించారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా వచ్చిన ఫారాల పరిష్కారంతో పాటు కొత్తగా వచ్చిన ఓటరు నమోదు ఫారాలపై సైతం ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వచ్చిన అభ్యంతరాలు, కొత్త ఓటర్ల నమోదు, పెండింగ్‌లో ఉన్న ఫారాలపై సమీక్షిస్తూ జాప్యం చేయకుండా పరిష్కరించాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, దేవరకద్ర ఈఆర్వో స్పెషల్ కలెక్టర్ నటరాజ్, కలెక్టర్ కార్యాలయ ఎన్నికల విభాగం అధిపతి అఖిలప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలం



మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్ రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి

దేవరకద్ర రూరల్: కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పార్లమెంట్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పదేళ్లుగా అధికారానికి దూరంగా ఉండి, ఎన్ని కష్టాలు ఎదురైనా పార్టీ జెండాను మోస్తూ రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని, కార్యకర్తల కష్టంతోనే మాకు పదవులు వచ్చాయని, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని తెలి పారు. బీజేపీ పాలనలో దేశం భ్రష్టు పట్టిందని, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతి ఎన్నికలకు ముందు మతం పేరును వాడుతుందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తూ, దేశ సంపదను అంతా అంబానీ, అదానీ లాంటి పెట్టుబడిదారులకు దోచిపెట్టిందని విమర్శించారు. అటువంటి బీజేపీని పారద్రోలి, అన్ని విధాల అభివృద్ధి చేసే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పార్టీని బలోపేతం చేయడంతో పాటు, దేశాన్ని ఐక్యం చేసేందుకు కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 4,080 కిలోమీటర్ల పాదయాత్ర చేసిన రాహుల్‌గాంధీని ప్రధాని చేసేందుకు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు.

కృషి మరువలేనిది: ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

రాష్ట్రంలో పదేళ్లు, నియోజకవర్గంలో 15 ఏళ్లు అధికారం లేకున్నా, అధికార పార్టీలు అక్రమ కేసులు పెట్టి బెదిరించినా, పార్టీ నమ్ముకొని ఉన్న నాయకులకు, కార్యకర్తలకు అండగా నిలబడతానని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తెలిపారు. వారి కృషితోనే ఎమ్మెల్యేగా గెలిచానని పేర్కొన్నారు. అంతకు ముందు స్థానిక నాయకులు వంశీచంద్‌రెడ్డితో పాటు, ఎమ్మెల్యేలకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, చిట్టెం పర్ణికారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరి అరవింద్‌రెడ్డి, అంజిల్‌రెడ్డి, కిషన్‌రావు, వర్మ, చందుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల అర్హత నిర్ధారణకే విచారణ

మహబూబ్‌నగర్ న్యూటౌన్: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై అనేక ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో లబ్ధిదారుల అర్హత నిర్ధారణ కోసమే విచారణ చేపడుతున్నట్లు కలెక్టర్ జి.రవినాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల సిబ్బంది 18మందితో బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వారం రోజుల్లో ఈ బృందాలు వారి విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ముందుగా మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర పట్టణ ప్రాంతాలలో బృందాలు విచారణ నిర్వహిస్తారని, 40 కాలమ్స్ ప్రొఫార్మాలో వివరాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. వారం రోజుల్లో ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు వివరించారు.

విద్యార్థులకు ప్రతిభా పరీక్ష

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా గణిత ఫోరం ఆధ్వర్యంలో ఎస్సెస్సీ విద్యార్థులకు జిల్లాకేంద్రంలోని షాషాబ్‌గుట్ట పాఠశాలలో ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా వివిధ మండలాల నుంచి 120 మంది విద్యార్థులు పరీక్షలో పాల్గొన్నారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఈఓ రవీందర్, ఏఎంఓ శ్రీనివాస్, సీఎంఓ బాలు యాదవ్, హెచ్‌ఎం వెంకట్రాములు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పీయూలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలి



నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నేతలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పీయూ అకాడమిక్ బ్లాక్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీయూ జేఏసీ నాయకుడు రాము మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసే దాని కంటే పీయూలోనే ఇంజినీరింగ్ కళాశాల విభాగాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటివరకు ఎలాంటి ముందడుగు లేదన్నారు. పీయూలోనే ఇంజినీరింగ్ కళాశాల ఉంటే దాని ద్వారా సాంకేతిక విద్యను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్వేరోస్ సురేందర్, మీసాల గణేష్ (ఎంఎస్‌ఎఫ్), పవన్‌రెడ్డి(ఏఐఎస్ఎఫ్), ఆంజనేయులు (ఎస్‌ఎఫ్‌ఐ) పాల్గొన్నారు.

లోక్‌సభపై నజర్

- ప్రధాన పార్టీల్లో ఎంపీ టికెట్ల కోసం పోటీ
- మల్లురవికి కీలక పదవి నేపథ్యంలో తెరపైకి సంపత్‌కుమార్
- తానే పోటీలో ఉంటానంటున్న మల్లురవి
- బీఆర్‌ఎస్, బీజేపీలో మొదలైన ఎన్నికల కసరత్తు



సాక్షి, నాగర్‌కర్నూల్: లోక్‌సభ ఎన్నికలకు గడువు సమీపిస్తున్న కొద్దీ ప్రధాన పార్టీలన్నీ తమ గెలుపు వ్యూహాలకు మరింత పదును పెడుతున్నాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ నియోజకవర్గ స్థానాల్లో పోటీ చేసేందుకు ప్రధాన పార్టీల నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ నుంచి ఎంపీ టికెట్ ఆశించిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవిని ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పదవి వరించింది. ఈ క్రమంలో తెరపైకి ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. అయినప్పటికీ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ నుంచి తాను బరిలో ఉంటానని సోమవారం మల్లురవి ప్రకటించారు. గతంలోనూ తాను ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి పదవి నిర్వహించానని, ఈ పదవి తనకేం కొత్త కాదని చెబుతున్నారు. ఎంపీ టికెట్ రేసులో ఉన్నానని స్పష్టం చేశారు.

■ నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గం ఎస్సీలకు రిజర్వ్ కాగా మొదటి నుంచి టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి ఇక్కడి నుంచి కాంగ్రెస్ లోక్‌సభ టికెట్ ఆశిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నిర్వహించిన బహిరంగసభల వేదికగా తాను ఎంపీగా బరిలో ఉంటానని ప్రజలు ఆశీర్వదించాలని ప్రకటించారు. అయితే లోక్‌సభ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ప్రభుత్వం మల్లురవిని ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధిగా నియమించారు. దీంతో ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్‌కు లోక్‌సభ కేటాయించే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. పార్టీ అధిష్ఠానం ఆదేశిస్తే ఎంపీగా పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఇటీవల సంపత్‌కుమార్ ప్రకటించారు. అయితే సంపత్‌తో పాటు సీఎం రేవంత్‌రెడ్డికి సన్నిహితుడిగా పేరున్న చారకొండ వెంకటేశ్ సైతం రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. మరోవపు మహబూబ్‌నగర్ స్థానంలో కాంగ్రెస్ నుంచి ఏఐసీసీ కార్యదర్శి వంశీచందర్‌రెడ్డి బరిలో ఉంటారన్న ప్రచారం సాగుతోంది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లోనూ పట్టు సాధించాలన్న తలంపుతో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

బీఆర్‌ఎస్, బీజేపీల్లో నేతల పోటీ..

బీఆర్‌ఎస్ పార్టీలో నాగర్‌కర్నూల్ స్థానం నుంచి ఎంపీ రాములుతో పాటు మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సైతం పార్టీ టికెట్టు రేసులో ఉన్నారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల ప్రకారం నడుచుకుంటానని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు చెబుతున్నారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ స్థానాల్లో గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన ఎమ్మెల్యేలకు ఎంపీ అభ్యర్థులుగా అవకాశం దక్కనుందన్న ప్రచారం సాగుతోంది. బీజేపీ నుంచి బంగారు శృతి మళ్లీ పోటీకి సిద్ధమవుతుండగా, మహబూబ్‌నగర్ స్థానం నుంచి పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్ పార్టీ టికెట్టుపై ఎవరికి వారు ధీమాతో ఉన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

అడ్డాకుల: మూసాపేట మండలం సంకలమద్ది శివారులోని గుట్ట వద్ద ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. కౌకుంట్ల మండలం ఇస్తంపల్లికి చెందిన బోయ రాజు (34) కొన్నేళ్ల కిందట మూసాపేట మండలం తుంకినీపూర్‌కు చెందిన తన అక్క కూతురు స్వాతిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా కొన్నాళ్ల నుంచి తుంకినీపూర్‌లోనే ఉంటూ వేములకు చెందిన ఓ వ్యక్తి వద్ద పని చేస్తున్నాడు. ఈక్రమంలో సంక్రాంతి పండగ మరుసటి రోజు నుంచి రాజు కనిపించడం లేదు. కుటుంబ సభ్యులు వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. తుంకినీపూర్‌కు చెందిన ఉపాధిహామీ కూలీలు మంగళవారం పని కోసం గుట్ట వద్దకు వెళ్లగా.. చెట్లలోంచి దుర్వాసన వచ్చింది. దీంతో దగ్గరికి వెళ్లి చూడగా.. చెట్టుకు ఉరేసుకుని ఉన్న మృతదేహం కనిపించడంతో గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. మృతుడి బావ కావలి నర్సింహులు గుట్ట వద్దకు వెళ్లి చూసి, తమ అల్లుడి మృతదేహమేనని గుర్తించారు. ఘటనా స్థలంలో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ శ్రీనివాసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..



కరుణాకర్(ఫైల్)

పెబ్బేరు రూరల్: మండలంలోని పాతపల్లికి చెందిన ఓ వ్యక్తి గడ్డి మందు తాగి మంగళవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ జగదీశ్వర్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. పెబ్బేరు మండలం పాతపల్లికి చెందిన ఎనుముల కరుణాకర్ (25) పెబ్బేరు మండల కేంద్రంలో బట్టలషాపు సొంతంగా పెట్టుకొని వ్యాపారం చేస్తున్నాడు. షాపులో బట్టలవ్యాపారం కోసం తెలిసిన వారితో అప్పులు చేశాడు. షాపు సరిగా నడవక పోవడంతో వారికి చెల్లించడంలో ఆలస్యమైంది. అప్పులిచ్చిన వాళ్లు డబ్బులు అడుగుతుండంతో ఈ విషయం ఇంట్లో వాళ్లకు చెప్పాడు. అప్పుల విషయంలో తీవ్ర మనస్తాపానికి గురై సోమవారం సాయంత్రం గ్రామంలోని డబుల్‌బెడ్రూంల దగ్గర గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు, స్నేహితులు వెంటనే అతన్ని వనపర్తి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. అతని తండ్రి బాలస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన వైష్ణవి (26), సాయికుమార్ భార్యాభర్తలు. వీరికి 10 నెలల కుమారుడు ఉన్నాడు. జిల్లా కేంద్రంలో కిరాణా దుకాణం నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో వైష్ణవి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. వైష్ణవి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనకు సంబంధించి పట్టణ రెండవ ఎస్‌ఐ రాంచందర్‌జీని వివరణ కోరగా.. తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక..

తెలకపల్లి: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. హెడ్‌కానిస్టేబుల్ నారాయణ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని కార్వంగకు చెందిన మొల్గర రామకృష్ణ (44) ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక మనస్థాపానికి గురై సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ పేర్కొన్నారు.

హైనా దాడిలో రెండు కుక్కలు మృతి

లింగాల: నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని అవుసలికుంట సమీపంలో సర్యాయికుంట వద్ద సోమవారం రాత్రి హైనా దాడిలో రెండు పెంపుడు కుక్కలు మృతి చెందాయి. అవుసలికుంటకు చెందిన రైతు బోయ బాలస్వామి తన వ్యవసాయ పొలం వద్ద తన రెండు కుక్కలను కట్టేసి ఇంటికి వెళ్లాడు. తిరిగి మంగళవారం ఉదయం పొలం వద్దకు వెళ్లగా కుక్కలు మృతి చెందాయి. డిసెంబర్ నెల 30న ఇదే గ్రామ సమీపంలోని బండగుట్ట దగ్గర చిరుత దాడిలో మేక మృతి చెందింది. నెల వ్యవధిలోని గ్రామ శివారులో రెండు ఘటనలు చోటు చేసుకోవడంతో అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గుర్తులను గమనించిన అటవీ శాఖ వారు హైనా దాడిలో మృతి చెందినట్లు గుర్తించారు. ఈ ప్రాంతంలో త్వరలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని బీట్ ఆఫీసర్ ఖాదర్‌పాష తెలిపారు. పొలాల వద్ద కుక్కలు, మేకలు, పశువులను రాత్రి వేళల్లో ఉంచరాదని రైతులకు సూచించారు.

కలియుగ వైకుంఠం.. మన్యంకొండ

- ఫిబ్రవరి 19 నుంచి లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు
- 24న స్వామివారి రథోత్సవం
- దేవస్థానానికి 600 ఏళ్ల చరిత్ర
- అళహరి వంశీయులచే దేవస్థానం స్థాపన
- హనుమద్దాసుల ప్రచారంతో ఖ్యాతి



మన్యంకొండ దేవస్థానం, ఇన్‌సెట్‌లో లక్ష్మీవేంకటేశ్వరస్వామి మూలవిరాట్

మహబూబ్‌నగర్ రూరల్: ఉమ్మడి జిల్లాలోనే పేరెన్నికగన్న మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం కలియుగ వైకుంఠంగా బాసిల్లుతోంది. తెలంగాణ తిరుపతిగా వినతికెక్కింది. కొలిచిన వారికి కొంగు బంగారమై విరాజిల్లుతోంది. ఇంతటి విశిష్టత గల మన్యంకొండ వాసుడి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 19 నుంచి మార్చి 27వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన స్వామివారి రథోత్సవం ఫిబ్రవరి 24వ తేదీ రాత్రి జరగనుంది. మహబూబ్‌నగర్ నుంచి 17 కిలోమీటర్ల దూరంలో రాయచూర్ అంతర్రాష్ట్ర రహదారి పక్కన ఎత్తయిన గుట్టలపై మన్యంకొండ దేవస్థానం కొలువుదీరింది. వందల సంవత్సరాల చరిత్ర గల లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం దినదినాభివృద్ధి చెందుతూ, భక్తుల ఇలవేల్పు దైవంగా విరాజిల్లుతోంది. తవ్వని కోనేరు, చెక్కని పాదాలు, ఉలి ముట్టని స్వామి ఇక్కడి ప్రత్యేకం. ఇంత విశిష్టత గల స్వామివారిని ప్రతి ఏడాది వేలాది మంది భక్తులు దర్శించుకుంటారు. స్వామివారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. కేవలం ఒక్క ఉత్సవాల్లోనే దాదాపు లక్షకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకుని తరిస్తారు.

దేవస్థానం చరిత్ర..

సుమారు 600 సంవత్సరాల క్రితం తమిళనాడులోని శ్రీరంగం సమీపంలో గల అళహరి గ్రామ నివాసి అళహరి కేశవయ్య కలలో శ్రీనివాసుడు కనిపించి, కృష్ణా నదీతీర ప్రాంతంలో గల మన్యంకొండపై నేను వెలసి ఉన్నానని.. నీవు వెంటనే అక్కడికి వెళ్లి నిత్య సేవా కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించి అంతర్ధానం అయ్యారని చెబుతారు. ఈమేరకు అళహరి కేశవయ్య తన తండ్రి అనంతయ్యతో పాటు కుటుంబ సభ్యులతో కలిసి మన్యంకొండ సమీపంలో గల కోటకదిరలో నివాసం ఏర్పరుచుకున్నారు. నిత్యం గుట్టపైకి వెళ్లి స్వామివారికి పూజలు చేయడం ప్రారంభించారు. అలాగే దక్షిణాది గల దివ్యక్షేత్రాలు తిరిగి తరిస్తూ వచ్చారు. అందులో భాగంగానే ఒకరోజు కృష్ణానదిలో స్నానమాచరించిన అనంతరం సూర్యభగవానుడిని నమస్కరించి, దోసిలితో ఆర్ఘ్యం వదులుచున్న సమయంలో చక్కని శిలారూపంలో గల వేంకటేశ్వర స్వామి ప్రతిమ నదిలో అలల ద్వారా వచ్చి కేశవయ్య దోసిలిలో నిలిచింది. శ్రీనివాసుడి విగ్రహాన్ని మన్యంకొండపై శేషషాయి రూపంలో గల గుహలో ప్రతిష్టించి, నిత్యదూప దీప నైవేద్యాలతో స్వామిని ఆరాధించడం ప్రారంభించారు. అంతేకాకుండా దేవస్థానం మండపంలో ఆంజనేయస్వామి, గరుడ్వాలర్ విగ్రహాన్ని కూడా ప్రతిష్టించారు. ఈ దేవస్థానం సమీపంలో మునులు తపస్సు చేయడంతో మన్యంకొండగా వినతికెక్కింది. కొన్నేళ్ల పాటు మన్యంకొండపై పూజలు జరిగాయి. ఆ తర్వాత పలు కారణాలతో పూజలు ఆగిపోయాయి.

అళహరి వంశీయులు వీరే..

మన్యంకొండ స్వామివారి సేవలో అళహరి వంశీయులు తరిస్తున్నారు. వారిలో అళహరి అనంతయ్య, కేశవయ్య, రంగయ్య, వెంకయ్య, పాపయ్య, హనుమద్దాసు, మేఘయ్య, అనంతయ్య, రామయ్య, వెంకటస్వామి, నారాయణస్వామి ఉన్నారు. ప్రస్తుతం అదే వంశానికి చెందిన అళహరి మధుసూదన్‌కుమార్ వంశ పారంపర్య ధర్మకర్తగా కొనసాగుతున్నారు. దేవస్థానం స్థాపనకు కృషి చేసిన అళహరి వంశీయుల వంశవృక్షాన్ని తెలియజెప్పే చిత్రపటం దేవస్థానంలో ఏర్పాటు చేశారు. వీరిలో కొందరి ఫొటోలు కూడా ఉన్నాయి.



మన్యంకొండలో స్వామివారి పాదము

ఉత్సవాల వివరాలు..

- ఫిబ్రవరి 19న కోటకదిరలోని అళహరి వంశీయుల ఇంటి నుంచి స్వామివారిని గుట్టపైకి ఊరేగింపుగా తీసుకొచ్చి ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. అదేరోజు రాత్రి స్వామివారి తిరుచ్చి సేవ నిర్వహిస్తారు.
- 20న హంసవాహన సేవ
- 21న గజవాహన సేవ
- 22న సూర్యప్రభ వాహన సేవ
- 23న హనుమ వాహన సేవ, ప్రభోత్సవం
- 24న గరుఢ వాహన సేవతో పాటు అర్ధ రాత్రి తర్వాత రథోత్సవం నిర్వహిస్తారు.
- 25న అశ్వవాహన సేవ, ద్వితీయ ప్రభోత్సవం,
- 26న శేషవాహనంలో స్వామివారి దర్బార్ సేవ,
- మార్చి 3న శేషవాహన సేవ,
- 8న మహాశివరాత్రి వేడుకలతో పాటు సంగీత, సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- 23నుంచి 27వ తేదీ వరకు దిగువ కొండ వద్ద కొలువుదీరిన అలివేలు మంగతాయారు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా 25న మధ్యాహ్నం 12గంటలకు అమ్మవారి తిరుకల్యాణ మహోత్సవం జరగనుంది. దీంతో స్వామివారి ఉత్సవాలు ముగుస్తాయి. దాదాపు నెలరోజుల పాటు స్వామివారి ఉత్సవాలు కొనసాగుతాయి.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు..



మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. దేవస్థానం అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు అన్ని విధాలా సహకరిస్తున్నారు.

– అళహరి మధుసూదన్‌కుమార్, చైర్మన్, మన్యంకొండ దేవస్థానం

హనుమద్దాసుల కీర్తనలతో ఖ్యాతి..

అళహరి వంశానికి చెందిన హనుమద్దాసుల వారి కీర్తనలతో మన్యంకొండ ఖ్యాతి గడించింది. దీంతో ఆగిపోయిన స్వామి పూజలు పునఃప్రారంభమయ్యాయి. హనుమద్దాసుల వారు దాదాపు 300 కీర్తనలు రచించారు. ఈ కీర్తనలు అప్పట్లో అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. దేవస్థానం చరిత్రను చాటిచెప్పాయి. హనుమద్దాసుల కృషిని తెలుసుకున్న గద్వాల, వనపర్తి సంస్థానాధీశులు మన్యంకొండకు వచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు. అంతేకాకుండా స్వామివారి ఉత్సవాలకు తమవంతు ధర్మంగా అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతి ఏడాది తమ సైనికులతో కలిసి మన్యంకొండకు వచ్చి, స్వయంగా ఉత్సవాల ఏర్పాట్లు చేసేవారు. ఏనుగులతో స్వామివారికి సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. హనుమద్దాసుల వారు అప్పట్లో దేవస్థానం వద్ద కోనేరును తవ్వించడంతోపాటు పెద్దగుడి గంటను కూడా ఏర్పాటు చేశారు. ఆ గంట ఇప్పటికీ చైర్మన్ గది పక్కన కనిపిస్తుంది.

తెలంగాణ తిరుపతి మన్యంకొండ..

తెలంగాణ తిరుపతిగా మన్యంకొండ విరాజిల్లుతోంది. ఇక్కడికి వచ్చి స్వామివారిని దర్శించుకుంటే తిరుపతికి వెళ్లినంత పుణ్యం లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. తిరుపతిలో ఏడుకొండలు ఎక్కి స్వామివారిని దర్శించుకుంటారు. అలాగే మన్యంకొండలో కూడా దేవస్థానం చుట్టూ ఏడు కొండలు ఉన్నాయి. ఇలాంటి పోలికలు ఇక్కడ చాలా ఉన్నాయి. ప్రభుత్వ సహకారంతో మన్యంకొండ దేవస్థానం దినదినాభివృద్ధి చెందుతోంది.

కోస్గిలో పోలీస్ పికెటింగ్

- సోమవారం రాత్రి ఘటనలో ఏడుగురిపై కేసు నమోదు
- పరిస్థితిని పర్యవేక్షిస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్



మాట్లాడుతున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

కోస్గి: పట్టణంలో సోమవారం రాత్రి రెండువర్గాల మధ్య చోటు చేసుకున్న ఘటనలో ఏడుగురిపై కేసు నమోదు చేయడంతో పాటు 144 సెక్షన్ అమలు చేస్తూ పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలను రెచ్చగొట్టేలా, వర్గాలను కించర్చేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోస్టు చేసిన వ్యక్తితో పాటు ఆయా గ్రూపుల అడ్మిన్లపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతుందని.. పట్టణంలోని ఆలయాలు, , మసీద్‌లు, ఇతర ప్రార్థన మందిరాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. అన్నివర్గాల మతపెద్దలు, యువకులు, సంఘ నాయకులు సమన్వయం పాటించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారు ఎవరైనా చర్యలు తీసుకుంటామన్నారు.

27న ఈదమ్మ జాతర తైబజారు వేలం

కొల్లాపూర్: కొల్లాపూర్‌లో త్వరలో ప్రారంభమయ్యే ఈదమ్మ జాతరలో తైబజారు వసూలు కోసం ఈనెల 27న వేలంపాట నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజయ్య వెల్లడించారు. వేలంలో పాల్గొనే వారు 25న సాయంత్రం 5 గంటలలోగా మున్సిపల్ కార్యాలయంలో రూ.5వేల డిపాజిట్ చెల్లంచి, పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. తైబజారు దక్కించుకున్న వారు పూర్తి మొత్తాన్ని 29వ తేదీలోగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

- భార్యకు తీవ్రగాయాలు



తిరుమలేష్ (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భార్యాభర్తను ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో భర్త మృతి చెందగా, భార్యకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం సమీపంలోని మెడికల్ కళాశాల సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. బిజినేపల్లి మండలం లింగసానిపల్లికి చెందిన తిరుమలేష్ (25) తన భార్య లక్ష్మితో కలిసి ద్విచక్ర వాహనంపై జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వచ్చి, స్వగ్రామానికి వెళ్తుండగా.. మెడికల్ కళాశాల సమీపంలో కొల్లాపూర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో తిరుమలేష్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. లక్ష్మికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ మహేందర్ పరిశీలించి, తిరుమలేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా తిరుమలేష్ వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. అతడికి వివాహమై ఏడాది కూడా కాలేదు. రోడ్డు ప్రమాదంలో తిరుమలేష్ మృతి చెందడం, భార్య లక్ష్మి తీవ్రగాయాలు కావడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మార్కెట్ కమిటీలపై గురి



అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

ఆశావహుల్లో మొదలైన సందడి

- కమిటీల రద్దు ప్రకటనతో మొదలైన పైరవీలు
- ఉమ్మడి జిల్లాలో 19 వ్యవసాయ మార్కెట్లు

అచ్చంపేట: రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్ కమిటీల రద్దు చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో ఆశావహుల్లో సందడి నెలకొంది.నామినేటెడ్ పోస్టుల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పోస్టు కీలకం. ఎమ్మెల్యే తర్వాత ఆ స్థాయిలో నియోజకవర్గంలో ప్రోట్‌కాల్ కలిగిన పోస్టు కావడంతో సీనియర్, జూనియర్ నేతలు అప్పుడే పైరవీలు మొదలుపెట్టారు. కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా వ్యవహరించిన వారు ఈ పోస్టులపై కన్నేశారు. జిల్లాలో నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయి. మార్కెట్ కమిటీలకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులనే పాలకులుగా, డైరెక్టర్లుగా నియమించగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తుందోనన్న చర్చ జరుగుతోంది. అయితే ప్రభుత్వం మార్కెట్ కమిటీలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు అందుకు సంబంధించిన జీఓ ఆర్డర్ కాపీలు ఆయా మార్కెట్లకు అందలేదు. దీంతో పాత కమిటీలు ఉన్నట్లా.. లేన్నట్లుగా భావించాలో తెలియని పరిస్థితి నెలకొంది.

రిజర్వేషన్ ఉంటుందా?

మార్కెట్ నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలో గత ప్రభుత్వం మొదటిసారి రిజర్వేషన్ల వ్యవస్థను తీసుకొచ్చింది. అప్పట్లో అన్ని వర్గాలకు చైర్మన్ పదవులు దక్కాయి. రైతులైతేనే తోటి రైతులకు న్యాయం చేయగలరన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం వారినే చైర్మన్లుగా, వైస్ చైర్మన్లుగా నియమించింది. రిజర్వేషన్ విధానం అమలు చేసి పాలకవర్గంలో 18 మంది సభ్యులుగా ఉండాలని నిర్ణయించింది. గతంలో చైర్మన్లు, వైస్ చైర్మన్లతో కలిపి సభ్యుల సంఖ్య మొత్తం 14 ఉండగా 18కి పెంచింది. తొలుత పాలకవర్గ పదవీకాలం ఏడాదిగా, తదుపరి రెండేళ్లకు పెంచింది. ఓసీ జనరల్ తదుపరి ఎస్సీ మహిళ, ఓసీ జనరల్, తర్వాత బీసీ–డీ, అనంతరం ఓసీ మహిళగా రిజర్వేషన్ అమలవుతోంది. ఈసారి రిజర్వేషన్ ఉంటుందో లేదో వేచి చూడాలి.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలి

మార్కెట్ కమిటీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదు. ప్రస్తుత కమిటీల రద్దుకు సంబంధించి ఎలాంటి జీఓ రాలేదు. కొత్త ప్రభుత్వం ఇచ్చే గెజిట్, నిబంధనల ప్రకారం కొత్త కమిటీలు ఏర్పాటు అవుతాయి.

మార్కెట్ల ఆదాయాన్ని బట్టి గ్రేడింగ్

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 19 వ్యవసాయ మార్కెట్‌లు ఉండగా షాద్‌నగర్, ఆమన్‌గల్లు, కొడంగల్ పట్టణాలు రంగారెడ్డి, వికరాబాద్ జిల్లాలోకి వెళ్లాయి. జిల్లాలో 16 మార్కెట్‌లు పనిచేస్తున్నాయి. వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ప్రధానంగా పంటల కొనుగోలు పరంగా పన్నుతో ఆదాయం లభిస్తుంది. ఆయా మార్కెట్ల ఆదాయాన్ని బట్టి ప్రభుత్వం గ్రేడింగ్ నిర్ణయిస్తుంది. రూ.3 కోట్లకు పైగా ఆదాయం ఉంటే సెలక్షన్ గ్రేడ్‌గా పరిగణిస్తుండగా డిప్యూటీ డైరెక్టర్ స్థాయి పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారు. దీని పరిధిలో ఒక్క మార్కెట్ కూడా లేదు. అలాగే రూ.కోటి నుంచి రూ.3 కోట్ల మధ్య ఆదాయం వస్తే స్పెషల్ గ్రేడ్‌గా పరిగణిస్తూ ఏడీ క్యాడర్ అధికారిని నియమిస్తారు. ఇందులో ఉమ్మడి జిల్లాలో మహబూబ్‌నగర్, బాదేపల్లి, నాగర్‌కర్నూల్, గద్వాల మార్కెట్లు మాత్రమే ఉన్నాయి. రూ.75 లక్షల నుంచి రూ.కోటి వరకు ఆదాయం ఉంటే గ్రేడ్–1గా, రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు ఉంటే గ్రేడ్–2గా, రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఆదాయం ఉంటే గ్రేడ్–3గా పరిగణిస్తూ అధికారులను నియమిస్తారు. రూ.25లక్షల వరకు ఆతీయం లభిస్తే దానికి అసిస్టెంట్ సెక్రటరీ స్థాయి అధికారిని నియమిస్తారు. గ్రేడ్–1లో మధనాపురం(వనపర్తి రోడ్డు), మక్తల్, అలంపూర్, ఇక గ్రేడ్–2లో వనపర్తి, కల్వకుర్తి, అచ్చంపేట, నారాయణపేట, దేవరకద్ర, గ్రేడ్–3లో కొల్లాపూర్, కోస్గి, ఆత్మకూర్, అసిస్టెంట్ సెక్రటరీ స్థాయిలో(ఏఎస్) నావాబుపేట, బాలానగర్, పెబ్బేరు కొనసాగుతున్నాయి.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



రంగాపూర్ నిరంజన్ షావలి దర్గా వద్ద భక్తులు

అచ్చంపేట: మండలంలోని రంగాపూర్‌లో వెలసిన నిరంజన్‌షావలి దర్గా వేడుకలు కొనసాగుతున్నాయి. మంగళవారం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత సామరస్యానికి దర్పణం పట్టే అతిపెద్ద రెండో ఉర్సు నిరంజన్ షావలి దర్గాలో ప్రత్యేక మొక్కులు ఉన్న భక్తులు వలికి ఫాతేహాలు, కందూర్లు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన భక్తులు దర్గాను సందర్శించారు. దర్గా సమీపంలో వెలసిన దుకాణాలు తగ్గుతున్నాయి. ఉర్సు ఏర్పాట్లను సర్పంచ్‌లు సక్రీ, లోక్యానాయక్ పర్యవేక్షిస్తున్నారు. మంగళవారం పట్టణంలో వ్యాపార కార్మిక సెలవు దినం కావడంతో కొంత రద్దీ కనిపించినప్పటికీ ఉత్సవాలు దాదాపు ముగింపు దశకు చేరింది. జిల్లా నలుమూలల నుంచే కాక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరై దర్గాలో మొక్కులు చెల్లించుకుంటున్నారు.



దర్గాలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

విద్యార్థిని అదృశ్యం

సెక్యూరిటీగార్డ్‌ను అరెస్టు చేసిన పోలీసులు

కొల్లాపూర్: స్థానిక మైనార్టీ గురుకుల పాఠశాలలోని ఓ విద్యార్థినిని ప్రేమ పేరుతో ఎత్తుకెళ్లాడనే ఆరోపణతో సెక్యూరిటీ గార్డ్‌ను పోలీసులు అరెస్టు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే.. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లికి చెందిన బాలిక స్థానిక మైనార్టీ గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. సంక్రాంతి సెలవులు రావడంతో ఈ నెల 11న బాలికను కుటుంబసభ్యులు ఇంటికి తీసుకెళ్లారు. 14వ తేదీ నుంచి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు బిజినేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పాఠశాలలో సెక్యూరిటీగార్డ్‌గా విధులు నిర్వర్తించే నిరంజన్ కూడా అదేరోజు నుంచి కనిపించడం లేదని ఆయన భార్య కొల్లాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలిక కోసం బిజినేపల్లి పోలీసులు వెదకగా సెక్యూరిటీ గార్డ్ వెంట వెళ్లినట్లు గుర్తించారు. ఈ నెల 16న ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నిరంజన్‌పై కిడ్నాప్, పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. బాలికను వైద్య పరీక్షలకు తీసుకెళ్లారు.

ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు మైనార్టీ సంక్షేమశాఖ అధికారులు వహీలా, జలీల్‌ఖాన్ మంగళవారం పాఠశాలకు వచ్చి బాలిక, నిరంజన్ వివరాలు సేకరించారు. నిరంజన్‌ను విధుల నుంచి తొలగించినట్లు వారు తెలిపారు. పాఠశాలలో సీసీ కెమెరాలు ఉన్నాయని.. విద్యార్థినుల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. ఘటనపై పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు చెప్పారు. సెక్యూరిటీ గార్డ్ నిరంజన్ రెండు వివాహాలు చేసుకోగా ఐదుగురు పిల్లలు ఉన్నారు.

ఆటో చోరీ : కేసు నమోదు

ఉండవెల్లి: మద్యం దుకాణాల వద్ద నిలిపిన ఆటోచోరీకి గురికావడంతో కేసు నమోదు చేసిన ఘటన మంగళవారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ బాల్‌రాజు తెలిసిన వివరాల ప్రకారం.. పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలో ఉన్న మద్యం దుకాణాల్లో తాగేందుకు ఈ నెల 14న కర్నూల్ జిల్లా బీ తాండ్రపాడుకు చెందిన సిరిగిరి కళాకర్, అతని చిన్నాన్న శాంతిసాగర్ ఆటోలో వచ్చారు. మద్యం తాగొచ్చి చూస్తే ఆటో మాయమైంది. చుట్టు పక్కల వెతికినా ఆటో కనిపించలేదు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు కళాకర్ ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మైనార్టీ గురుకుల ప్రవేశానికి దరఖాస్తులు

నారాయణపేట రూరల్: పట్టణంలోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో 5 నుంచి 8వ తరగతి వరకు ప్రవేశాలు పొందడానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ సంక్షేమ అధికారి గోవిందరాజన్ కోరారు. జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో మంగళవారం ప్రవేశాలకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 5వ తరగతిలో 80సీట్లు మైనార్టీలకు, 20శాతం సీట్లు మైనార్టీయేతర విద్యార్థులకు రిజర్వ్ చేయబడ్డాయని, మిగితా తరగతుల్లో కేవలం మైనార్టీలకు సీట్లు కేటాయించబడ్డాయని చెప్పారు. ఫిబ్రవరి 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఖాజా మహబూబ్‌ఖాన్, సిబ్బంది అలీం, పంకజ్, ఖాసీం, నల్లారెడ్డి, నారాయణ, మైనోద్దిన్, జహంగీర్, శివశంకర్, హరీష్ పాల్గొన్నారు.



బ్రోచర్ విడుదల చేస్తున్న గోవిందరాజన్

టీడీపీలో ధిక్కార స్వరం

తమ సంగతి తేల్చాలని ఎక్కడికక్కడ నేతల పట్టు

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు పరిస్థితి 'ముందు గొయ్యి.. వెనుక నుయ్యి'లా తయారైంది. పార్టీ టికెట్ల కేటాయింపుపై నిర్ణయం తీసుకోలేక తల బొప్పి కట్టిపోతోంది. జనసేనతో పొత్తుపై పార్టీ నేతలంతా పెదవి విరుస్తుండటంతో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా మారింది. తమ టికెట్ సంగతి తేలిస్తేనే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటామని ఎక్కడికక్కడ నేతలు తెగేసి చెబుతుండటంతో తండ్రీ కొడుకులకు నిద్ర కరువైంది.

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. ఇప్పటికే పాతాళానికి కుంగిన ఆ పార్టీ.. ఎన్నికలు సమీపించే కొద్దీ ఇంకా లోతుకు కూరుకుపోతోంది. క్షేత్ర స్థాయిలో ఇప్పటికే పూర్తిగా అయోమయం నెలకొంది. పలుచోట్ల పార్టీకి ఇన్‌ఛార్జిలు లేకపోవడాన్ని బట్టే ఆ పార్టీ పరిస్థితి ఏమిటన్నది ఇట్టే అర్థమవుతోంది. నాయకులు ఉన్న చోట కూడా కుమ్ములాటలతో సతమతమవుతోంది. ఈ నేపథ్యంలోనే విజయవాడ ఎంపీ కేశినేని నాని ఆ పార్టీకి రాజీనామా చేశారు. తిరువూరు మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు కూడా టీడీపీకి గుడ్‌బై చెప్పారు. అదే బాటలో మరికొందరు టీడీపీని వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు జనసేనతో ఇప్పటికే పొత్తులో ఉంటూ.. బీజేపీతో కూడా పొత్తు ప్రయత్నాలు చేస్తుండటంతో గందరగోళం ఇంకా పెరిగిపోయింది. తమ పార్టీ ఎక్కడ పోటీ చేస్తుందో, ఏ స్థానంలో తాము పోటీలో ఉంటామో తెలియక టీడీపీ క్యాడర్ అయోమయంలో మునిగిపోయింది. ఈ పరిస్థితుల్లో పలుచోట్ల కీలక నేతలు చంద్రబాబును ధిక్కరిస్తున్నారు. పార్టీ కార్యక్రమాల్లో సైతం పాల్గొనకుండా ముందు తమ సంగతి తేల్చాలని పట్టుబడుతున్నారు.

గాల్లో గంటా శ్రీనివాసరావు సీటు

సీనియర్ నేత గంటా శ్రీనివాసరావును చంద్రబాబు గాల్లో పెట్టడంతో ఆయన అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఒకసారి గెలిచిన చోట మళ్లీ పోటీ చేయని గంటా వచ్చే ఎన్నికల్లో తనకు విజయనగరం జిల్లా నెల్లిమర్ల సీటు ఇవ్వాలని కోరుతుండగా చంద్రబాబు ఎటూ తేల్చడం లేదు. దీంతో ఏం చేయాలో తెలియక ఆయన తంటాలు పడుతున్నారు. చింతకాయల అయ్యన్నపాత్రుడు కుటుంబం కూడా టీడీపీపై రగిలిపోతోంది. పార్టీకి అండగా ఉన్న తమను దూరం పెడుతున్నారని వాపోతోంది. అయ్యన్న తనకు అనకాపల్లి ఎమ్మెల్యే సీటు, తన కుమారుడికి అనకాపల్లి ఎంపీ సీటు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. కానీ ఎవరో ఒకరికి మాత్రమే సీటు ఇస్తామని చంద్రబాబు స్పష్టం చేయంతో అయ్యన్న అలక వహించారు. పార్టీ కార్యక్రమాలకు సైతం దూరంగా.. మౌనంగా ఉంటున్నారు. విశాఖ జిల్లా పెందుర్తి సీటు జనసేనకు ఇచ్చే పరిస్థితి ఉండడంతో అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అసంతృప్తితో రగిలి పోతున్నారు. తన సీటు జనసేనకు ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్న ఆయన.. అవసరమైతే పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. తమకు సీట్లు ఇవ్వకపోతే టీడీపీ సంగతి చూస్తామని గాజువాక, అనకాపల్లి నేతలు పల్లా శ్రీనివాసరావు, పీలా గోవింద్‌లు అంతర్గతంగా హెచ్చరికలు జారీ చేశారు.

కాకినాడలో టీడీపీకి హెచ్చరికలు

కాకినాడ సిటీ స్థానాన్ని జనసేనకు ఇస్తే తాను మరో దారి చూసుకుంటానని మాజీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు స్పష్టం చేస్తున్నారు. కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి ఇప్పటికే బహిరంగంగా తన సీటు జనసేనకు ఇవ్వొద్దని కోరారు. ఒకవేళ ఇస్తే తాను ప్రత్యామ్నాయం చూసుకుంటానని హెచ్చరించారు. మాజీ మంత్రి కేఎస్ జవహర్ కూడా పార్టీని ధిక్కరిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు సీటు తనకివ్వాల్సిందేనని ఆయన పట్టుబడుతుండగా, చంద్రబాబు మరో వ్యక్తికి ఇవ్వాలని చూస్తున్నారు. తేడా వస్తే ఆయన జంప్ అవడం ఖాయంగా కనిపిస్తోంది. కాగా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో టీడీపీ నేతల మధ్య జనసేన చిచ్చు పెట్టింది. ఇక్కడ అధిక శాతం సీట్లు జనసేనకు కేటాయిస్తున్నట్లు ప్రచారం జరుగుతుండటంతో టీడీపీ నేతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

దేవినేని ఉమకు సీటు లేదు

ఎన్టీఆర్ జిల్లాలో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుకు సీటు లేదని చెప్పడంతో ఆయన లోలోన కుంగిపోతూ ప్రత్యామ్నాయాలు వెతుకుతున్నట్లు తెలుస్తోంది. మైలవరం సీటును ఆయనకు కాదని కొత్త వ్యక్తికి ఇస్తామని చంద్రబాబు చెప్పడంతో ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం మొదటి నుంచి పని చేసిన తనను మోసం చేశారని వాపోతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో దివంగత కోడెల శివప్రసాద్ తనయుడు శివరామ్ ఇప్పటికే తిరుగుబాటు జెండా ఎగుర వేశారు. ఆయన స్థానంలో బీజేపీ నుంచి వచ్చిన కన్నా లక్ష్మీనారాయణకు సత్తెనపల్లి సీటు ఇస్తుండడంతో ఆయన టీడీపీని వీడేందుకు సిద్ధమయ్యారు. చిలకలూరిపేట సీటు విషయంలో భాష్యం ప్రవీణ్, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు మధ్య పోటీ నెలకొంది. సీటు లేకపోతే టీడీపీని వదిలేందుకు పుల్లారావు ఏర్పాట్లు చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. నెల్లూరు సిటీ స్థానాన్ని వైఎస్సార్‌సీపీ బహిష్కృత ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి ఇచ్చే అవకాశం ఉండడంతో మొదటి నుంచి అక్కడ పని చేసిన మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తనకు న్యాయం దక్కలేదంటూ ఆయన టీడీపీని వీడాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

అనంత, కర్నూలు జిల్లాల్లోనూ అదే తీరు

ఉమ్మడి అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో ప్రస్తుత ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరనాయుడు, మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి గ్రూపులు ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటున్నాయి. ఎవరికి సీటిచ్చినా రెండో వర్గం తిరుగుబాటు చేసే పరిస్థితి నెలకొంది. మరోవైపు ధర్మవరం ఇన్‌ఛార్జిగా ఉన్న పరిటాల శ్రీరామ్ అక్కడి నుంచి పోటీ చేయాలని చూస్తుండగా, గత ఎన్నికల్లో ఓటమి తర్వాత బీజేపీలోకి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరి సీటు తనదేనని చెప్పుకుంటున్నారు. దీంతో పరిటాల ఆగ్రహంతో ఊగిపోతున్నారు. తనను నమ్మించి పని చేయించుకుని ఇప్పుడు మాట మారిస్తే ఊరుకోనని ఆయన హెచ్చరిస్తున్నారు. ఒక ఇంట్లో ఒకరికే టికెట్ అని చంద్రబాబు చెప్పడంతో రాప్తాడులో పరిటాల సునీత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నంద్యాల ఇన్‌ఛార్జిగా భూమా బ్రహ్మానందరెడ్డిని తప్పించి మాజీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను నియమించడంతో ఆ నియోజకవర్గంలో అసమ్మతి రాజుకుంది. బ్రహ్మానందరెడ్డి టీడీపీని వీడేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఆలూరు సీటు ఇవ్వకపోతే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, ఆయన సతీమణి సుజాతమ్మ చంద్రబాబుకు ఝలక్ ఇవ్వనున్నారు. డోన్ అభ్యర్థిగా చంద్రబాబు.. ధర్మవరం సుబ్బారెడ్డిని ప్రకటించగా, కేఈ ప్రభాకర్ తాను రేసులో ఉన్నట్లు స్పష్టం చేశారు. చంద్రబాబు తీరుపై కేఈ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆళ్లగడ్డ సీటు జనసేనకు కేటాయిస్తారనే ప్రచారంతో మాజీ మంత్రి అఖిలప్రియ మండిపడుతున్నారు. అదే జరిగితే ఆమె టీడీపీకి గుడ్‌బై చెప్పేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.

మీరే నా స్టార్ క్యాంపెయినర్లు

- మీ బిడ్డ ప్రభుత్వంలో మంచి జరిగిన ఇళ్లలోని అక్కచెల్లెమ్మలే నా ప్రచారకర్తలు
- ఉరవకొండ సభలో ఏపీ సీఎం వైఎస్ జగన్


లబ్ధిదారుల సమక్షంలో బటన్ నొక్కి నాలుగో విడత ఆసరా నిధులను విడుదల చేస్తున్న సీఎం జగన్

సాక్షి, అనంతపురం (ఉరవకొండ) : 'ప్రజలకు ఏ మంచీ చేయని వారికి, ప్రజలను మోసం చేసిన వారికి ఇంత మంది స్టార్ క్యాంపెయినర్లు ఉన్నారు. ప్రతి పేద ఇంటికి అభివృద్ధి ఫలాలు అందించిన మీ బిడ్డకు, మంచి చేసిన మీ బిడ్డకు ఎలాంటి స్టార్ క్యాంపెయినర్లు లేరు. అయితే మీ బిడ్డ వాళ్లెవరినీ నమ్ముకోలేదు. వీళ్లందరి కంటే ఎక్కువగా నాకు స్టార్ క్యాంపెయినర్లు ఉన్నారని గట్టిగా చెబుతున్నాను. మీ బిడ్డ ప్రభుత్వంలో మంచి జరిగిన ఇళ్లలోని అక్కచెల్లెమ్మలే నా స్టార్ క్యాంపెయినర్లు' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. అనంతపురం జిల్లా ఉరవకొండలో మంగళవారం ఆయన వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగవ విడత నిధుల విడుదల సభలో మాట్లాడారు. 'జెండాలు జత కట్టడమే వారి ఎజెండా.. జనం గుండెల్లో గుడి కట్టడమే మీ జగన్ ఎజెండా' అని తెలిపారు. వారందరికీ భిన్నంగా తనకున్నంత మంది స్టార్ క్యాంపెయినర్లు దేశ చరిత్రలోనే కాదు.. రాజకీయ చరిత్రలో ఎవరికి ఉండరన్నారు. మీ ఇంట్లో మంచి జరిగి ఉంటే మాత్రం మీరే మీ బిడ్డకు స్టార్ క్యాంపెయినర్లుగా నిలవాలని కోరారు. జరుగబోయే కురుక్షేత్ర సంగ్రామంలో మీ బిడ్డకు మీరే సైనికుల్లా నిలవాలన్నారు. మనం వేసే ఓటు.. నొక్కే బటన్ ఎందుకు నొక్కుతున్నామో మనసులో పెట్టుకోవాలని చెప్పారు. మీరు వేసే ఓటు ఒక్క జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవడమే కాదు.. పేద కుటుంబాలు పేదరికం నుంచి బయట పడేందుకనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. జగన్ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చుంటేనే అది జరుగుతుందని మనసులో పెట్టుకోవాలని చెప్పారు.

దురుద్దేశాలతోనే నాపై 'పిల్'

- నా ప్రతిష్టను దెబ్బతీసేందుకే ఈ వ్యాజ్యం
- నాపై విద్వేషపూరిత, తప్పుడు ఆరోపణలు చేయడమే ఎంపీ రఘురామకృష్ణరాజు పని
- హైకోర్టులో సీఎం వైఎస్ జగన్ ప్రాథమిక కౌంటర్ దాఖలు

సాక్షి, అమరావతి: దురుద్దేశాలు, రాజకీయ కారణాలతో ఎంపీ రఘురామకృష్ణరాజు తనపై ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం హైకోర్టుకు నివేదించారు. తనపై విద్వేషపూరిత, తప్పుడు ఆరోపణలు చేయడమే ఆయన పనిగా పెట్టుకున్నారని వివరించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు, దుష్ప్రవర్తనకు పాల్పడినందుకు అతనిపై అనర్హత వేటువేయాలని లోక్‌సభ స్పీకర్‌కు తమ పార్టీ తరఫున లేఖ రాశామన్నారు. ఈ కారణంతోనే అప్పటి నుంచి రాఘురామకృష్ణరాజు తనపై వ్యక్తిగత కక్ష పెంచుకున్నారని తెలిపారు. తనపై ద్వేషాన్ని తెలియజేసేందుకు ఆయన పలు మార్గాలను ఎంచుకున్నారని వివరించారు. అతని కక్షపూరిత ధోరణి, శతృత్వం ప్రజలందరికీ తెలుసునన్నారు. ఇందులో భాగంగా.. అనేక సందర్భాల్లో తనపై నిరాధార ఆరోపణలు చేశారని జగన్‌మోహన్‌రెడ్డి వివరించారు. ఇదే రీతిలో రాజ్యాంగపరంగా ఉన్నత పదవుల్లో ఉన్న వ్యక్తులు, అధికారులపై కూడా నిరాధార ఆరోపణలు చేశారన్నారు. తనపై పలు నిరాధార, తప్పుడు ఆరోపణలు చేస్తూ తన బెయిల్‌ను రద్దుచేయాలంటూ రఘురామకృష్ణరాజు తెలంగాణ హైకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేశారని, ఆ ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేకపోవడంతో హైకోర్టు దానిని కొట్టేసిందన్నారు. నిజానికి.. ఆయన సదుద్దేశంతో కోర్టును ఆశ్రయించలేదని తెలిపారు. అతనిపై ఉన్న క్రిమినల్ కేసుల గురించి తన పిటిషన్‌లో ప్రస్తావించకుండా దాచిపెట్టారని సీఎం వివరించారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన పిల్‌ను భారీ జరిమానాతో కొట్టేయాలని ముఖ్యమంత్రి జగన్ న్యాయస్థానాన్ని కోరారు. అంతేకాక.. ప్రతివాదుల జాబితా నుంచి తన పేరును తొలగించాలని కూడా అభ్యర్థించారు. తన ప్రతిష్టను దెబ్బతీసేందుకు, ఆయా ప్రభుత్వ శాఖల పనితీరుపై దూషణలు చేసేందుకే ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారని ఆయన తన కౌంటర్‌లో పేర్కొన్నారు.

ప్రభుత్వ విధానాలపై సీబీఐ దర్యాప్తు జరపండి..

రాష్ట్ర ప్రజల సంక్షేమ కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేస్తున్న పలు ప్రజా సంక్షేమ పథకాలకు దురుద్దేశాలను ఆపాదించడంతో పాటు ఆ పథకాలవల్ల పలువురికి లబ్ధిచేకూర్చేలా ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలున్నాయని.. వాటిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం మంగళవారం మరోసారి న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయి ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు వచ్చినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్. శ్రీరామ్ స్పందిస్తూ.. ఈ పిల్ విచారణార్హతపై అభ్యంతరం లేవనెత్తారు. దీంతో న్యాయస్థానం ఈ వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డితో సహా 40 మందికి నోటీసులు జారీచేసి, పిల్ విచారణార్హతపై అభ్యంతరాలుంటే తెలియజేస్తూ అఫిడవిట్‌లు దాఖలుచేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే. కోర్టు ఆదేశాల మేరకు జగన్‌మోహన్‌రెడ్డి తన అభ్యంతరాలతో ప్రాథమిక కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు. తదుపరి విచారణను ఫిబ్రవరి 12కి వాయిదా వేసింది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పడమటి ఆంజనేయస్వామి హుండీ లెక్కింపు



మక్తల్: మండలంలోని పడమటి ఆంజనేయ స్వామి ఆలయ హుండీ లెక్కింపును మంగళవారం నిర్వహించారు. మొత్తం రూ.6,51,716 ఆదాయం వచ్చినట్లు ఈఓ శ్యామ్‌సుందర్‌చారి తెలిపారు. ఆంజనేయస్వామి తిరుణాలకు ముందు లెక్కించడం ఆనవాయితీగా వస్తుంది. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మిశ్రమ వెండి ఆభరణాలను యథావిధిగా హుండీలో ఉంచారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పూజరి ప్రాణేష్, అరవిందు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలు వాయిదా

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈనెల 29న నిర్వహించాల్సిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను వాయిదా వేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈనెల 19న ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల్లో పాల్గొనే ఓటర్ల జాబితాను ఉపాధ్యాయులు పాఠశాలలు, గ్రామపంచాయతీల్లో ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పాఠశాలల్లో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. ఎన్నికలు నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. కాగా గతంలో ఉన్న ఎస్ఎంసీ కమిటీలను టెరిమ్నెట్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈమేరకు ఉమ్మడి జిల్లాలోని 3,725 పాఠశాలల కమిటీలు రద్దు కానున్నాయి.

అవినీతికి అడ్డా.. ఎక్సైజ్ కార్యాలయం



జడ్చర్ల ఎక్సైజ్ కార్యాలయం

- ప్రతి పనికి డబ్బుల డిమాండ్
- విధులను నిర్లక్ష్యం చేస్తున్నారన్న ఆరోపణలు
- ఏసీబీ దాడులతో అంతా గప్‌చుప్

జడ్చర్ల: స్థానిక ఎక్సైజ్ సీఐ బాలాజీ సోమవారం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడటంతో కార్యాలయం అవినీతికి అడ్డాగా మారిందన్న ఆరోపణలు నిజమేనని అనిపిస్తోంది. బాలాజీ స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో సుమారు నాలుగేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయన బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి కార్యాలయంలో విచ్చలవిడిగా అవినీతి చోటు చేసుకుందని బాధితుల నుంచి ఆరోపణలు వెల్లువెత్తాయి. గీత కార్మికులకు టీఎఫ్‌టీ లైసెన్స్‌ల జారీకి మొదటి రూ.25 వేలు ఇవ్వగా, సోమవారం రూ.65 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. ఇందులో ఎవరి వాటా ఎంతో కూడా తేలాల్సి ఉంది. ఉన్నతాధికారులు, సిబ్బందికి వాటాలు ఇవ్వాలంటూ వ్యాపారుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

సీజ్ చేసిన బార్‌లో విక్రయాలు..

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో 44వ నంబర్ జాతీయ రహదారిని అనుసరించి నిర్వహిస్తున్న ఓ బార్ అండ్ రెస్టారెంట్ నుంచి ఎక్సైజ్‌శాఖ నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా మద్యం కాటన్లను డీసీఎంలో తరలిస్తుండగా జీఎస్టీ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన అప్పట్లో సంచలనంగా మారింది. ఎక్సైజ్‌శాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంతో సీజ్ చేసిన బార్‌లో మద్యం విక్రయాలు యథావిధిగా కొనసాగుతున్నాయి. ఇదే విషయమై సీఐకి ఫిర్యాదులు అందినా బార్ నిర్వాహకులకు మద్దతుగా నిలిచారచే తప్పా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సర్కిల్ పరిధిలో ఏడు మండలాలు..

జడ్చర్ల ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం పరిధిలో జడ్చర్ల, మిడ్జిల్, బాలానగర్, రాజాపూర్, అడ్డాకుల, భూత్పూర్, మూసాపేట మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లో 26 మద్యం దుకాణాలతో పాటు మూడు బార్ అండ్ రెస్టారెంట్లు, 150 వరకు కల్లు దుకాణాలు ఉన్నాయి. గీత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చే టీఎఫ్‌టీ లైసెన్స్‌ల జారీకి సైతం పెద్దమొత్తంలో లంచం డిమాండ్ చేయడం విస్తుగొలుపుతున్న వాస్తవం.

ఎక్సైజ్ సీఐకి రిమాండ్..

జడ్చర్ల: గీత కార్మికులకు టీఎఫ్‌టీ లైసెన్స్‌ల జారీకి రూ.65 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన జడ్చర్ల ఎక్సైజ్ సీఐ బాలాజీని రిమాండ్‌కు తరలించినట్లు మహబూబ్‌నగర్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్ తెలిపారు. మంగళవారం నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపర్చామని.. న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. అదేవిధంగా హైదరాబాద్ సింగరేణి కాలనీలో ఉన్న ఎక్సైజ్ సీఐ ఇంట్లో కూడా సోదాలు నిర్వహించామన్నారు.

తనిఖీలు అంతంత మాత్రమే..

సర్కిల్ పరిధిలోని మద్యం, కల్లు దుకాణాలతో పాటు బెల్టు షాపులపై దాడులు చేసిన దాఖలాలు మచ్చుకైనా కానరావు. ఎవరైనా ఫిర్యాదు చేసినా గుట్టుగా వెళ్లి లోలోపలే సెటిల్‌మెంట్ చేస్తారన్న ఆరోపణలు ఉన్నాయి. 44, 167వ నంబర్ జాతీయ రహదారులపై ఎక్సైజ్ అధికారుల తనిఖీలు కానరావు. వాహనాల్లో యథేచ్ఛగా సీహెచ్, గంజాయి తదితర మత్తు పదార్థాలు తరలుతున్నా తమకేమి పట్టనట్లుగా అధికారులు, సిబ్బంది పనితీరు ఉందంటే అతిశయోక్తి కాదు. ఓ వాహనంలో సీహెచ్ తరలిస్తుండగా 44వ నంబర్ జాతీయ రహదారిపై రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందం పట్టుకున్నారు. అదేవిధంగా 167వ నంబర్ జాతీయ రహదారిపై లారీలో పెద్దమొత్తంలో గంజాయి తరలిస్తుండగా రాష్ట్ర నార్కొటిక్ అధికారులు పట్టుకున్నారు. ఆయా ఘటనలకు సంబంధించి స్థానిక అధికారులకు సమాచారం లేకపోవడం గమనార్హం. సిబ్బంది నామమాత్రంగా విధులు నిర్వర్తిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అధికారులు, సిబ్బంది ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి విధులపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

సకాలంలో బస్సులు నడపాలని విద్యార్థుల ధర్నా


ఖిల్లాఘనపురం బస్టాండులో బస్సులు నడపాలని రోడ్డుపై నిరసన చేస్తున్న విద్యార్థులు

ఖిల్లాఘనపురం: పాఠశాలల సమయంలో బస్సులు నడపాలని కోరుతూ విద్యార్థులు ఖిల్లాఘనపురం బస్టాండులో నిరసన చేపట్టారు. మండలంలోని దొంతికుంటతండా తెలంగాణ మోడల్ పాఠశాలకు చెందిన సుమారు 100 మంది విద్యార్థులు మంగళవారం ఉదయం ఖిల్లాఘనపురం బస్టాండు వద్దకు వచ్చారు. పాఠశాల సమయం దగ్గర పడుతుండడంతో విద్యార్థులు బస్సుల కోసం ఎదురు చూశారు. ఈ సమయంలో ఓ బస్సు మహబూబ్‌నగర్ నుంచి వనపర్తి వైపునకు వెళ్లేందుకు బస్టాండుకు చేరుకుంది. కొంత మంది విద్యార్థులు బస్సు లోపల, టాపుపైన ఎక్కారు. అయినా బస్సులో స్థలం లేకపోవడంతో చాలామంది విద్యార్థులకు అక్కడే ఉన్నారు. పాఠశాల సమయం దాటిపోవడంతో విద్యార్థులు బస్సు ఎక్కేందుకు యత్నించారు. వీలు కాకపోవడంతో చేసేది లేక బస్సు ఎదుట కూర్చొని నిరసన చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు బస్టాండు దగ్గరికి చేరుకుని విద్యార్థులకు నచ్చజెప్పారు. విషయాన్ని ఆర్టీసీ డీఎం దృష్టికి తీసుకెళ్తామని చెప్పి విద్యార్థులను శాంతింపజేశారు.


ఖిల్లాఘనపురం బస్టాండులో బస్సు టాపు పైకి ఎక్కుతున్న విద్యార్థులు

ఎంవీఎస్‌లో బీఎఫ్ఎస్ఐ కోర్సు ప్రారంభం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో బీఎఫ్ఎస్ఐ కోర్సును మంగళవారం ప్రారంభించారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐసీటీ ప్రాజెక్టు అకాడమిక్ హెడ్ బి.గోపాల్ మాట్లాడారు. నూతనంగా కళాశాలలో ఏర్పాటు కోర్సు 15 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. ప్రతి రోజు ఒక కొత్త విషయం.. బ్యాంకింగ్, ఆన్‌లైన్, కమ్యూనికేషన్ స్కిల్స్, సమస్య పరిష్కారం వంటి అంశాలను బోధిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, మాస్టర్ ట్రెనర్ షేక్‌గౌడ్ పాష, సత్యనారాయణ, రాజేందర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రికెట్ పోటీలు


తలపడుతున్న మన్నెవారిపల్లి సీసీ వర్సెస్ సీసీఏ

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న సీవీకే ఆల్ ఇండియా లెవల్ టీ–20 క్రికెట్ టోర్నీలో మూడో రోజు మంగళవారం మన్నెవారిపల్లి సీసీ, గ్రీన్‌సిటీ ఎలెవన్ జట్లు గెలుపొందాయి. గ్రూపు–ఏ నుంచి మధ్యాహ్నం సెషన్‌లో గ్రీన్‌సిటీ ఎలెవన్ వర్సెస్ జెడ్ ఎలెవన్ సీసీ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న జెడ్ ఎలెవన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లకుగాను 17ఓవర్లలోనే 107 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టు బ్యాట్స్‌మెన్ ఫరూఖ్ 20, రాహుల్‌అహ్మద్ 14, దీపక్‌వైద్ 13 మినహా మిగతా బ్యాట్స్‌మెన్లు తక్కువ స్కోర్‌కే ప్రత్యర్థి బౌలర్లకు వికెట్లను సమర్పించుకున్నారు. ప్రత్యర్థి బౌలర్లు కరణ్‌వర్మ 3-0-33-3, హర్షవర్ధన్‌సింగ్ 2-0-6-2, అభిషేక్ 3-0-19-2, కమల్ త్రిపాఠి 4-0-24-2, దివ్యాన్షు 4 ఓవర్లలో కేవలం 9 పరుగులిచ్చి ఒక వికెట్ తీసి రాణించారు. దీంతో జెడ్ ఎలెవన్ స్కోర్ 107 పరుగులకే కుప్పకూలింది. 108 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన గ్రీన్‌సిటీ ఎలెవన్ 11.1 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి విజయాన్ని చేరుకుంది. దీంతో 9 వికెట్ల తేడాతో గ్రీన్‌సిటీ ఎలెవన్ గెలుపొందింది. ఇన్నింగ్స్ ప్రారంభం నుంచే ఓపెనర్ కనిష్కదూబే దూకుడుగా ఆడాడు. 39 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో అర్ధ సెంచరీ చేసి నాటౌట్‌గా నిలిచాడు. హిమాన్షు షిండే 27 (14 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్), అంకిత్‌ధానే 24 (14 బంతుల్లో 4ఫోర్లు) పరుగులు సాధించారు. ప్రత్యర్థి జట్టు నుంచి 10 మంది బౌలర్లు బౌలింగ్ చేయడం విశేషం. అలీంకు ఒక్క వికెట్ దక్కింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌ను కరణ్‌వర్మ అందుకున్నాడు. అందకుముందు గ్రూపు–బీ నుంచి ఉదయం సెషన్‌లో మన్నెవారిపల్లి సీసీ వర్సెస్ సిటీ క్రికెట్ అకాడమీ తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మన్నెవారిపల్లి సీసీ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. మొదట వికెట్లను కోల్పోయినా భారీ స్కోర్ చేసింది. జట్టు బ్యాట్స్‌మెన్ శుభం ఘన్‌శ్యాం 36 (18 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్) ఆఖరి ఓవర్లలో దూకుడగా ఆడాడు. మనోహర్ 34 (18 బంతుల్లో 4 ఫోర్లు, 2సిక్స్‌లు), జయసూర్య 27, వినయ్‌గౌడ్ 22, ప్రతీక్‌పవార్ 20 పరుగులతో రాణించారు. ప్రత్యర్థి బౌలర్లు సామ్ 2, అహ్మద్‌ఖాన్, అబ్రార్, నఫీజ్‌ఉల్‌హక్, కునాల్‌సోని తలో వికెట్ తీసినా పరుగుల వరదను ఆపలేకపోయారు. 193 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన సిటీ క్రికెట్ అకాడమీ జట్టు బ్యాట్స్‌మెన్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. ప్రత్యర్థి బౌలర్లకు తలొగ్గారు. 17.5 ఓవర్లలో 78 పరుగులకే ఆలౌట్ అయ్యింది. దీంతో 114 పరుగుల తేడాతో మన్నెవారిపల్లి సీసీ గెలుపొందింది. సీసీఏ జట్టులో సామ్ 20, ఓమ్ ధనుష్ 11 పరుగులు తప్పా మిగతా బ్యాట్స్‌మెన్లు సింగిల్ డిజిట్లకే పరిమితమయ్యారు. ప్రత్యర్థి బౌలర్లు హరీష్‌రెడ్డి 4 ఓవర్లలో ఏడు పరుగులిచ్చి ఒక వికెట్ తీసి పొదుపుగా బౌలింగ్ చేశాడు. కేఆర్, శుభం ఘన్‌శ్యాం, జయసూర్య చెరో రెండు వికెట్లు తీయగా, అరవింద్, భరత్, రోగర్ ఒక్కో వికెట్ తీశారు. ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా ఘన్‌శ్యాం అందుకున్నాడు.

నేడు బీచుపల్లిలో సీతారాముల కల్యాణం

ఎర్రవల్లిచౌరస్తా: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామ స్వామి ఆలయంలో బుధవారం సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్ రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై సీతారాముల కల్యాణ వేడుకను తిలకించాలని కోరారు.


కోదండరామస్వామి ఆలయం